ప్రజాశక్తి
ఆదివారం 29 జూన్ 2025
5
పార్వతీపురం మన్యం



ఐటిఐలో రేపు జాబ్‌మేళా

ప్రజాశక్తి - సీతంపేట

స్థానిక ప్రభుత్వ ఐటిఐలో ఈనెల 30న ఉదయం 9గంటల జాబ్‌మేళా నిర్వహించనున్నట్టు ఐటిఐ ప్రిన్సిపల్ మూటక గోపాలకృష్ణ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. సన్‌రైజస్ వర్క్. పార్సి ప్రైవేట్ లిమిటెడ్, ఫోర్స్ ప్రైవేట్ లిమిటెడ్ బెంగుళూరు వారి సౌజన్యంతో ఈ జాబ్ మేళా నిర్వహిస్తున్నట్టు తెలిపారు. ఆసక్తి గల అభ్యర్థులు సోమ, మంగళవారాల్లో ఉదయం 9గంటలకు తమ బయోడేటా, జిరాక్సులు ధ్రువపత్రాలు, ఒక పాస్ ఫోటో, ఇతర ధ్రువపత్రాలతో హాజరుకావాలన్నారు. మరిన్ని వివరాలకు 9493817472, 9491134464 ఫోన్ నెంబర్లకు సంప్రదించాలని సూచించారు.

ఆశ్రమ పాఠశాలల్లో ఎఎన్‌ఎంలు మరిలేనట్టే!

ప్రజాశక్తి - పార్వతీపురం

రాష్ట్రంలోని గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాలల్లో ఎఎన్‌ఎంల నియామకం మరిలేనట్లేనని స్పష్టమవుతోంది. సమీప సచివాలయాల్లోని ఎఎన్‌ఎంలే వారానికి రెండు రోజులు గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాలలకు వెళ్లి విద్యార్థుల ఆరోగ్య పరిరక్షణ చూడాలని ఆదేశిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. గత ప్రభుత్వం అనుసరించిన విధానాన్నే టిడిపి ప్రభుత్వం కూడా అమలు చేస్తోంది. రాష్ట్రంలో టిడిపి కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత గిరిజన సంక్షేమ శాఖ మంత్రిగా గుమ్మిడి సంధ్యారాణి బాధ్యతలు స్వీకరించారు. బాధ్యతలు స్వీకరించిన వెంటనే ఆమె మాట్లాడుతూ ఆశ్రమ పాఠశాలల్లో విద్యార్థుల ఆరోగ్యం కోసం ఎఎన్‌ఎంల నియామకానికి సంబంధించిన ఫైలుపై తొలి సంతకం చేసినట్లు చెప్పారు. ఇది జరిగి ఏడాది పూర్తయినా ఇంతవరకు ఎఎన్‌ఎంల నియామకం జరగలేదు. ఆర్థిక అనుమతి కోసం ఫైలు వెళ్లిందని, అనుమతి రాగానే నియామకం చేపడతామని గత కొంతకాలంగా మంత్రి సంధ్యారాణితో సహా అధికారులు చెప్పుకొచ్చారు. ఈ ఏడాది జూన్‌లో గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాలల ప్రారంభానికైనా ఎఎన్‌ఎంల నియామకంపై ప్రభుత్వం నిర్ణయం తీసుకుంటుందని భావించారు. ఈనెల 12న ప్రభుత్వ పాఠశాలలు ప్రారంభమయ్యాయి. కానీ ప్రభుత్వం నుంచి ఎలాంటి స్పందన కనిపించడం లేదు.



ఆశ్రమ పాఠశాల విద్యార్థులకు వైద్యతనిఖీలు చేస్తున్న వైద్యాధికారులు (ఫైల్)

సచివాలయ ఎఎన్‌ఎంలతోనే సర్దుబాటు
గిరిజన మంత్రి తొలి సంతకం బుట్టదాఖలు

సచివాలయ ఎఎన్‌ఎంల మెడపై సంక్షేమ కత్తి

గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాలల్లో ఎఎన్‌ఎంల నియామకం లేనట్లేనని రాష్ట్ర ప్రభుత్వం నుంచి సంకేతాలు అందడంతో ఐటిడిఎ పిఒలు సరికొత్త ఉత్తర్వులు జారీ చేశారు. గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాలలున్న గ్రామ సచివాలయాల్లో ఎఎన్‌ఎంలు వారానికి రెండు రోజుల పాటు పాఠశాలలకు వెళ్లి విద్యార్థులకు ఆరోగ్య పరీక్షలు నిర్వహించాలని ఆదేశిస్తూ పార్వతీపురం ఐటిడిఎ పిఒ అశుతోష్ శ్రీ వాత్సవ ఉత్తర్వులు జారీచేశారు. ఐటిడిఎ పరిధిలోని గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాలలకు ఏ సచివాలయం ఎఎన్‌ఎంలు వెళ్లాలో నిర్దేశిస్తూ ఉత్తర్వులు జారీ చేయడంతో రెగ్యులర్ ఎఎన్‌ఎంల నియామకం లేనట్లేనని తెలుస్తోంది. ఈ విద్యాసంవత్సరం చివరి వరకూ సచివాలయం ఎఎన్‌ఎంలే ఈ బాధ్యతలు నిర్వహించాలని ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. విద్యార్థులకు ఎప్పటికప్పుడు రక్తపరీక్షలు నిర్వహించి హెల్త్ రికార్డులు అందజేయాలని, పాఠశాలలో సిక్ రూంలు వుండేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. సచివాలయం పరిధిలోని గ్రామాల ప్రజల ఆరోగ్యంపై దృష్టి సారిస్తూ అధికారులకు కావాల్సిన సమాచారాన్ని అందజేయాల్సి ఉంటుంది. ఈ విధులతో పాటు గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాలల్లో విద్యార్థుల ఆరోగ్య పరిరక్షణపై శ్రద్ధ వహించాల్సి ఉంది. సంబంధిత గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాల హెచ్‌ఎం, వార్డెన్ల ఫోన్లకు అందుబాటులో ఉండాలని సూచించారు. ఇక నుంచి గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాలల్లో విద్యార్థులు అనారోగ్యంతో మరణిస్తే సచివాలయం ఎఎన్‌ఎంలను కూడా బాధ్యులను చేసే అవకాశం కనిపిస్తోంది. ఏమైనా సచివాలయం ఎఎన్‌ఎంల మెడపై' సంక్షేమ కత్తి' వేలాడుతున్న పరిస్థితి నెలకొంది.

విద్యార్థుల మరణాల నియంత్రణ సాధ్యమేనా?

గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాలల్లో విద్యార్థుల మరణాలు ఉండరాదనే లక్ష్యంతో ఎఎన్‌ఎంలను నియమించాలనే డిమాండ్ గత కొంతకాలంగా వినిపిస్తోంది. గిరిజన, ప్రజా సంఘాల నాయకులు ముక్తకంఠంతో గొంతెత్తుతున్నారు. ఒకదశలో టిడిపి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఎఎన్‌ఎంల నియామకం జరుగుతుందని విద్యార్థుల తల్లిదండ్రులు, గిరిజన సంఘాల నాయకులు భావించారు. రెండో ఏడాది ప్రారంభంలోనైనా ప్రభుత్వం మాట నిలబెట్టుకుంటుందని ఆశించారు. అయితే ప్రభుత్వం వారి ఆశలపై నీళ్లు చల్లింది. పాత పద్ధతిలోనే సచివాలయం ఎఎన్‌ఎంలతోనే నడిపించాలని ప్రభుత్వం సంకేతాలు పంపించింది. గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాలల్లో విద్యార్థుల ఆరోగ్య పరిరక్షణ పాఠశాల హెచ్‌ఎం, వార్డెన్లకు సవాల్‌గా మారింది. ఏటా వర్షాకాలంలో విరివిగా వర్షాలు పడడం వల్ల, రక్తహీనత, రోగనిరోధక శక్తి తక్కువగా ఉండడంతో ఆశ్రమ పాఠశాలల్లో విద్యార్థులు మలేరియా జ్వరాలకు గురవుతుంటారు. జ్వరం ప్రాథమిక దశలో ఉన్నప్పుడే సరైన వైద్యమందిస్తే విద్యార్థులు ప్రాణాపాయ స్థితి నుంచి బయటపడే అవకాశం ఉంటుంది. విద్యార్థుల ఆరోగ్య పరిస్థితిని అంచనా వేసే పరిజ్ఞానం పాఠశాల హెచ్‌ఎం, వార్డెన్లకు ఉండదు. నిత్యం వారి ఆరోగ్య పరిరక్షణపై అవగాహన ఉన్న ఎఎన్‌ఎంలు ఉంటే అనారోగ్యానికి గురైన వెంటనే ఎలాంటి వైద్యం చేయాలో వారికి అవగాహన ఉంటుంది. సచివాలయ ఎఎన్‌ఎంలు వారానికి రెండు రోజుల పాటు పాఠశాలలకు వెళ్లినంత మాత్రాన విద్యార్థుల ఆరోగ్య పరిస్థితిని వారు అంచనా వేయలేరనే వాదనలు వినిపిస్తున్నాయి. ఏటా ఏజెన్సీ ప్రాంతంలోని గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాలల్లో విద్యార్థులు మలేరియా, డెంగీ జ్వరాలతో మృత్యువాత పడుతున్నారు. చేతులు కాలాక ఆకులు పట్టుకున్న చందంగా గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాలల్లో విద్యార్థుల మలేరియా జ్వరాలు ముదిరిన తర్వాత దగ్గరలోని పిహెచ్‌సిలకు, ఇతర ప్రభుత్వ ఆసుపత్రులకు తీసుకెళ్లే పరిస్థితి కనిపిస్తోంది. ప్రాథమిక దశలో వున్నప్పుడే మలేరియా నివారణకు ఎలాంటి వైద్యం చేయాలో పాఠశాల హెచ్ ఎం, వార్డెన్‌కు అవగాహన ఉండకపోవడంతో పరిస్థితి చేయి దాటి పోయే వరకు వెళుతోంది. ఏమైనా ఆశ్రమ పాఠశాలల్లో విద్యార్థుల ఆరోగ్య పరిరక్షణపై ప్రభుత్వ నిర్ణయాన్ని గిరిజన సంఘాలు తీవ్రంగా వ్యతిరేకిస్తున్నాయి.

ఆశ్రమ పాఠశాలల్లో ఎఎన్‌ఎంలను నియమించాలి

జిల్లాలో సుమారు 55 వరకు ఆశ్రమ పాఠశాలలు ఉన్నాయి. రెండు ఐటిడిఎ పరిధిలో ఉన్న పాఠశాలల్లో పూర్తిస్థాయిలో సిబ్బంది లేరు. దీంతో పర్యవేక్షణ కొరవడింది. ఆశ్రమ పాఠశాలల్లో ఎఎన్‌ఎంలను నియమించాలి. గిరిజన సంక్షేమ శాఖ మంత్రి సంధ్యారాణి ఇచ్చిన హామీ నిలబెట్టుకోవాలి. తొలి సంతకం అమలు చేయాలి. సాలూరు, పార్వతీపురం ఎస్టీ వసతిగృహాలకు అదనపు భవనాలు నిర్మించాలి. విద్యార్థుల మరణాలకు రాష్ట్ర ప్రభుత్వం, గిరిజన శాఖ మంత్రి బాధ్యత వహించాలి. ప్రతి నెలా పాఠశాలల్లో మెడికల్ క్యాంపులు నిర్వహించాలి.

కె.రాజు, ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి

37 మంది విద్యార్థినులకు మలేరియా

సాలూరు : మండలంలోని కొత్తవలస గిరిజన సంక్షేమ ఆశ్రమ బాలికల ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు మామిడిపల్లి పిహెచ్ సి వైద్యాధికారి డాక్టర్ శివకుమార్ ఆధ్వర్యాన సిబ్బంది వైద్య పరీక్షలు నిర్వహించారు. 617 మంది విద్యార్థినులకు పరీక్షలు నిర్వహించగా, 37 మందికి మలేరియా ఉన్నట్లు నిర్ధారణ అయిందని డాక్టర్ శివకుమార్ చెప్పారు. వీరికి చికిత్స అందజేస్తున్నట్టు తెలిపారు.



అధికారుల సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ శ్యామ్ ప్రసాద్

పిఎం సూర్యఘర్ లక్ష్యాలు సాధించాలి : కలెక్టర్

ప్రజాశక్తి - పార్వతీపురం

జిల్లాలో పిఎం సూర్యఘర్ కింద నిర్దేశించిన లక్ష్యాలను సాధించాలని కలెక్టర్ ఎ.శ్యామ్ ప్రసాద్ ఎంపిడిఒ లు, విద్యుత్ శాఖ అధికారులను ఆదేశించారు. సూర్యఘర్, జుగా, పారిశుధ్య నిర్వహణపై సంబంధిత అధికారులతో కలెక్టర్ తన ఛాంబరులో శనివారం సమీక్షించారు. సూర్యఘర్ కోసం చాలావరకు దరఖాస్తులు అందాయని, అయితే ఆ దిశగా యూనిట్లు స్థాపన జరగడం లేదన్నారు. కావున సంబంధిత అధికారులు దీనిపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. ఈ నెలాఖరులోగా వెయ్యి యూనిట్లను స్థాపించాలని లక్ష్యాలను నిర్దేశించగా, ఇప్పటి వరకు 289 యూనిట్ల స్థాపన జరిగినట్లు చెప్పారు. గతంలో లబ్ధిదారుడు నగదు చెల్లించిన తర్వాత సబ్సిడీ వచ్చేదని, ప్రస్తుతం ఆ సబ్సిడీ మినహాయించి యూనిట్ ధరను చెల్లిస్తే సరిపోతుందని కలెక్టర్ వివరించారు. లబ్ధిదారుడు చెల్లించాల్సిన మొత్తాన్ని బ్యాంకుల ద్వారా రుణంగా పొందవచ్చని లేదా స్త్రీనిధి నుంచి రుణాన్ని పొందే సౌలభ్యం ఉందని అన్నారు. ఈ సమస్యలన్నీ అధిగమించి సూర్యఘర్ యూనిట్లు త్వరగా ఏర్పాటు చేసుకునేలా అధికారులు ప్రత్యేక చొరవ చూపాలని కలెక్టర్ ఆదేశించారు. గ్రామాల్లోని చెత్తను ప్రతి ఇంటి నుంచి సేకరించడమే కాకుండా, అదే రోజు ఉదయం 7గంటల్లోగా మొబైల్ యాప్ నందు పారిశుధ్య వివరాలను నమోదు చేయాల్సి ఉందన్నారు. కానీ అనేక గ్రామాల్లో పారిశుధ్య పనులు చేపట్టినప్పటికీ యాప్‌లో వివరాలు నమోదు చేయడం లేదని, దీనివల్ల వారు పనిచేయనట్లు అవుతుందనే విషయాన్ని గుర్తించాలన్నారు. ఇకపై ప్రతి గ్రామంలో పారిశుధ్య వివరాలు నమోదయ్యేలా జిల్లా గ్రామ పంచాయతీ అధికారి పర్యవేక్షించాలని కలెక్టర్ ఆదేశించారు. పారిశుధ్య కార్మికులు మాస్ లీవ్ పెట్టకుండా చూడాలన్నారు. డిఎ జుగా అవగాహన కార్యక్రమంలో వచ్చిన దరఖాస్తులపై తక్షణమే చర్యలు తీసుకోవాలని, తద్వారా ప్రజలు లబ్ధిపొందాలని పేర్కొన్నారు. అలాగే కుటుంబ సభ్యులంతా ఈ కార్యక్రమం ద్వారా లబ్ధి పొంది ఉంటే, అటువంటి వారి విజయగాథలను సేకరించాలని కలెక్టర్ సూచించారు. డిఆర్‌డిఎ పిడి ఎం.సుధారాణి, సంబంధిత శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

దౌర్జన్యం చేసిన ఎస్ఐపై చర్యలు తీసుకోవాలి

ప్రజాశక్తి - సాలూరు:

టెన్ టివి జర్నలిస్టు ఎంఎల్ నాయుడుపై దౌర్జన్యం చేసిన విజయనగరం టుటౌన్ ఎస్ఐపై చర్యలు తీసుకోవాలని కోరుతూ స్థానిక జర్నలిస్టులు శనివారం స్థానిక తహశీల్దార్ నీలకంఠరావుకు వినతిపత్రం సమర్పించారు. విధి నిర్వహణలో ఉన్న జర్నలిస్టు నాయుడ్ని దుర్భాషలాడడం అమానుషమని అన్నారు. పోలీసుల దౌర్జన్యంపై చర్యలు తీసుకోకపోతే ఆందోళన తీవ్రతరం చేస్తామని హెచ్చరించారు. జర్నలిస్టు సంఘం నాయకులు విశ్వేశ్వర రావు, మోహన్,బి.శ్రీనివాసరావు,నల్లి శ్రీనివాసరావు పాల్గొన్నారు.



జాబ్‌మేళాను ప్రారంభిస్తున్న మంత్రి సంధ్యారాణి

జాబ్‌మేళాను సద్వినియోగం చేసుకోవాలి : మంత్రి

ప్రజాశక్తి - సాలూరు

నిరుద్యోగులకు ఉపాధి అవకాశాలు కల్పించేందుకు ఎపి స్టేట్ స్కిల్ డెవలప్మెంట్ కార్పొరేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన మెగా జాబ్ మేళాను యువత సద్వినియోగం చేసుకోవాలని రాష్ట్ర గిరిజన సంక్షేమ, స్త్రీ, శిశు సంక్షేమశాఖా మంత్రి జి.సంధ్యారాణి కోరారు. శనివారం స్థానిక శ్రీసాయి డిగ్రీ కాలేజీలో ఎపి స్టేట్ స్కిల్ డెవలప్మెంట్ కార్పొరేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన మెగా జాబ్ మేళాను మంత్రి ప్రారంభించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ ప్రతి ఒక్క యువతకు ఉపాధి అవకాశాలు కల్పించేందుకు ప్రభుత్వం నిరంతరం కృషి చేస్తోంది. ఈ జాబ్ మేళా ద్వారా ఎన్నో కుటుంబాల్లో వెలుగు రాబోతుంది. యువత శ్రమించే మనస్తత్వంతో, అర్హతలతో ఉంటే ఉద్యోగం లభించడం ఖాయమని అన్నారు. ఈ జాబ్ మేళాలో 12 ప్రముఖ ప్రైవేటు కంపెనీలు పాల్గొన్నాయి. సాంకేతిక రంగం, ఫార్మా, మెషీనింగ్, కస్టమర్ సపోర్ట్, ఫైనాన్స్, మాన్యుఫ్యాక్చరింగ్ తదితర విభాగాల్లో 415 ఉద్యోగాల భర్తీకి నోటిఫికేషన్లు జారీ అయ్యాయి. ఇంటర్వ్యూలు స్థలంలోనే నిర్వహించబడి, పలువురు అభ్యర్థులు తక్షణమే ఎంపికయ్యారు. అభ్యర్థులు తమ సివిల్, విద్యార్హత పత్రాలు, గుర్తింపు కార్డులతో వచ్చి ఇంటర్వ్యూలకు హాజరయ్యారు. మహిళా అభ్యర్థుల సంఖ్య గణనీయంగా ఉండడం విశేషం. యువతకు మార్గదర్శకంగా ఉండేలా క్యాంపస్ రిక్రూట్‌మెంట్, స్కిల్ మాపింగ్, జాబ్ రోల్ అవగాహన వంటి అంశాలపై కూడా స్పష్టమైన సమాచారం అందించ బడింది. అనంతరం మంత్రి స్టాల్స్ సందర్శించి, యజమానులతో పాటు అభ్యర్థులతో మాట్లాడారు. యువతలో అద్భుతమైన నైపుణ్యం ఉందని ప్రశంసిస్తూ, ఇలా ఉద్యోగ మేళాలు నియమితకాల వ్యవధిలో ప్రతి జిల్లాలో నిర్వహించేందుకు అవసరమైన చొరవ తీసుకోవాలని అధికారులకు సూచించారు.

నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే చర్యలు : ఎస్‌పి

ప్రజాశక్తి - పార్వతీపురం టౌన్



వీడియో కాన్ఫరెన్స్‌లో మాట్లాడుతున్న ఎస్‌పి మాధవరెడ్డి

పోలీసు అధికారులు విధి నిర్వహణలో అలసత్వంగా, నిర్లక్ష్యంగా వ్యవహరిస్తేన శాఖాపరమైన చర్యలు ఎస్‌పి ఎస్‌వి మాధవరెడ్డి హెచ్చరించారు. స్థానిక స్థానిక జిల్లా పోలీసు కార్యాలయంలో జిల్లాలోని డిఎస్పీలు, సిఐలు, ఎస్సైలతో జూమ్ వీడియో కాన్ఫరెన్సు(వర్చువల్ విధానంలో)లో నెలవారీ నేర సమీక్షా సమావేశము నిర్వహించారు. పెండింగ్‌లో ఉన్న గ్రేవ్, నాన్ గ్రేవ్ కేసులు, మర్డర్, ప్రాపర్టీ, వాహనాలు దొంగతనం, 174 సి ఆర్ పి సి కేసులు, మిస్సింగ్, గంజాయి, రోడ్డుప్రమదాల కేసులు, శాంతిభద్రతల పరిరక్షణ చర్యలు, నాన్ బెయిల్‌బుల్ వారెంట్లు మొదలగు విషయాలపై జిల్లా పోలీస్ అధికారుల ద్వారా సమాచారాన్ని సేకరించి తగిన సూచనలు, సలహాలు, మెలకువలను చేశారు. ముఖ్యంగా ఎన్ఫోర్స్మెంట్ కేసులను స్టేషన్ల వారీగా సమీక్షించారు. లాంగ్ పెండింగ్ కేసులు, ఎన్‌డిపిఎస్ కేసులు త్వరితగతిన పరిష్కరించి దర్యాప్తు పూర్తిచేసి ఛార్జ్ షీట్స్ కోర్ట్‌కు సమర్పించి ఎస్‌సి, సిసి నెంబర్లు పొందాలని సూచించారు. ప్రతి కేసులో కీలక ఆధారాలను గమనించి, అందుబాటులో ఉన్న సాంకేతిక పరిజ్ఞానంతో కేసును త్వరితగతిన చేధించాలని ఆదేశించారు. ఇ -చలాన, డ్రంక్ అండ్ డ్రైవ్ కేసులు ఎక్కువగా నమోదు చేయాలని ఆదేశాలు జారీచేశారు. నాటుసారా, గంజాయి రవాణా, అమ్మకం చేసే వారిపై దాడులు నిర్వహించి కేసులు నమోదు చేయాలన్నారు. గంజాయి కేసుల్లోని పరారీలో ఉన్న ముద్దాయిలను అరెస్ట్ చేసేలా చర్యలు తీసుకోవాలి, పెండింగ్లో ఉన్న ఎన్ బిడబ్ల్యు అమలు చేసేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. సమావేశాలు, ర్యాలీలు, ఊరేగింపులు, ప్రదర్శనలు, ధర్నాలు నిర్వహించడానికి నిరభ్యంతర ధ్రువీకరణ, అనుమతి పత్రం సంబంధిత పోలీస్ అధికారులనుండి తప్పక పొందాలని సూచించారు. లోక్ అదాలత్‌లో రాజీ అయ్యే కేసులను, ఇరువర్గాల వారితో మాట్లాడి రాజీ అయ్యేలా చూడాలని ఆదేశించారు. సైబర్ నేరాలు, మహిళా సంబంధిత నేరాలపై శక్తి యాప్, మత్తుపదార్థాల వినియోగం వాల్ల కలిగే అనార్థాలు గురించి అవగాహన కల్పించాలని తెలిపారు. ట్రైనింగ్ ఐజి వి.మోహన్‌రావు మాట్లాడుతూ జిల్లాలోని కాలేజీల్లో విద్యార్థులు ర్యాగింగ్‌కు పాల్పడకుండా అవగాహన కల్పించాలన్నారు. మహిళా సంబంధిత నేరాలపై ప్రత్యేక శ్రద్ధతో దర్యాప్తు జరపాలి, పోక్సో, ఎస్సీ, ఎస్‌టి కేసుల్లో మహిళలపై దాడులు జరగకుండా తగిన చర్యలు తీసుకునేలా చర్యలు చేపట్టాలని సూచించారు. సమావేశంలో పాలకొండ డిఎస్‌పి రాంబాబు, డిసిఆర్‌బి సిఐ ఆదాం, సోషల్ మీడియా, సైబర్ సెల్ సిఐ శ్రీనివాసరావు, సిసిఎస్ సిఐ అప్పారావు, ఎస్బీ సిఐ రంగనాథం, పలువురు సిఐలు, ఎస్సైలు, ఇతర అధికారులు పాల్గొన్నారు.



ఏరియా ఆసుపత్రి సూపరింటెండెంట్‌కు సూచనలు ఇస్తున్న మలేరియా జోనల్ అధికారులు

మలేరియా మరణాల్లేవు : జెడ్ఎంఒ

ప్రజాశక్తి - సీతంపేట

జిల్లాలో ఎక్కడా మలేరియా మరణాలు సంభవించలేదని వైద్య అధికారులు, మలేరియా సిబ్బంది అప్రమత్తంగా ఉన్నారని విశాఖ మలేరియా జోనల్ అధికారి బొడ్డేపల్లి మీనాక్షి అన్నారు. శనివారం ఆమె సీతంపేట ఏజెన్సీలోని ధోనుబాయి ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని పరిశీలించారు. అనతరం ఆశ్రమ పాఠశాలను సందర్శించారు. విద్యార్థుల సిక్ రూము మార్చి వేరే రూములో పెట్టాలని తెలిపారు. అనంతరం బూర్జిగూడలో మలేరియా పాజిటివ్ కేసు పరిశీలించారు. రోగులకు ఏ విధంగా వైద్యం అందుతుందని ఆరా తీశారు. అనంతరం ఘాటి గుమ్మడలో యాంటీ లార్వా ఆపరేషన్‌ను పరిశీలించారు. ఇక్కడ మలేరియా మందుల కొరత లేదన్నారు. హైరిస్క్ గ్రామాల్లో స్ప్రేయింగ్ జరిగిందని చెప్పారు. దోమతెరలు త్వరలోనే వస్తాయన్నారు. అనంతరం సీతంపేట ఏరియా ఆసుపత్రిని సందర్శించారు. పిల్లల వార్డులోని రోగులను పరిశీంచారు. ఆస్పత్రి వైద్య సేవలు నిర్వహణ బాగానే ఉన్నాయని కితాబు ఇచ్చారు. ఆమె మాట్లాడుతూ జనవరి నుంచి జూన్ 28 వరకు 76 మలేరియా కేసులు నమోదయ్యాయని తెలిపారు. వైద్య సిబ్బంది అప్రమత్తంగా ఉండాలన్నారు. ఆమె వెంట అసిస్టెంట్ డైరెక్టర్ కెవిఎస్ ప్రసాద్, డిప్యూటీ డిఎంహెచ్వో కె విజయ పార్వతి, డిఎంఒ పివి సత్యనారాయణ, ఎఎంఒ శ్రీనివాసరావు, మెడికల్ ఆఫీసర్ డాక్టర్ భానుప్రతాప్, ఏరియా హాస్పిటల్ సూపరింటెండెంట్ బి.శ్రీనివాస రావు, కన్సల్టెంట్ శ్రీకాంత్ ఎంపిహెచ్ఒ తిరుపతిరావు, సబ్ యూనిట్ అధికారి మోహన రావు, తదితరులు పాల్గొన్నారు.

ఎరువుల దుకాణంపై విజిలెన్స్ దాడులు

- 119.925 టన్నుల ఎరువులు సీజ్
- ప్రజాశక్తి వార్తకు స్పందన

ప్రజాశక్తి - మక్కువ



ఎరువులును సీజ్ చేస్తున్న అధికారులు

మండలంలోని శంబరలో గల ఎరువుల దుకాణాలపై విజిలెన్స్ అధికారులు శనివారం దాడులు నిర్వహించారు. ప్రజాశక్తితో శనివారం ప్రచురితమైన 'పక్క రాష్ట్రానికి ఎరువు... స్థానిక రైతుకు కరువు' అన్న వార్తకు అధికారులు స్పందించారు. ఈ మేరకు విజిలెన్స్ అధికారులు రామారావు, సబ్ ఇన్స్పెక్టర్ పురుషోత్తం ఆధ్వర్యాన ఈ దాడులు జరిగాయి. ఈ దాడుల్లో శంబర గ్రామం కొత్త వీధిలో గల శ్రీ సత్య సాయి ట్రేడర్‌ను తనిఖీ చేయగా, రైతులకు అధిక ధరలకు ఎరువులు అమ్మకం చేసినట్లు అధికారులు గుర్తించారు. అనంతరం రికార్డులను పరిశీలించారు. ఎరువుల భౌతిక నిల్వలకు, స్టాక్ రిజిస్టర్‌కు వ్యత్యాసాన్ని గుర్తించారు. ఈ మేరకు షాపులో ఉన్న రూ. 28,77,422 విలువ గల 119.925 టన్నుల కల్గిన 2399 బస్తాల ఎరువులను సీజ్ చేశారు. ఈ తనిఖీల్లో పోలీస్ కానిస్టేబుల్, వ్యవసాయ శాఖ అధికారులు పాల్గొన్నారు.

సమస్యలు పట్టించుకోని సర్కారు

ప్రజాశక్తి - విజయనగరం ప్రతినిధి



గాదెలోని గింజలు గాదెలోనే ఉండాలా. గుంటడు మాత్రం గారకాయలా ఉండాలన్నాడట వెనుకటి ఓ వ్యక్తి. ప్రజాసమస్యలపై ప్రభుత్వం స్పందిస్తున్న తీరు ఇందుకు అద్దం పడుతోంది. సర్కారు సేవలు చేయించుకుంటుంది గానీ, వారికి ఉన్న సమస్యలు, ఇబ్బందులను మాత్రం పరిష్కరంచడం లేదు. దీంతో, గడిచిన వారమంతా స్కీమ్ వర్కర్లు, చిరుద్యోగులు, చివరకు రైతులు, సాధారణ ప్రజానీకం ఆందోళన బాటపట్టారు. ముఖ్యంగా మధ్యాహ్నం భోజన పథకం కార్మికులకు మార్చి నుంచి వేతనాలు మంజూరు నిలిచిపోయింది. బిల్లులు కూడా చెల్లించలేదు. దీంతో, తాము పస్తులు ఉండడంతోపాటు బడిపిల్లలకు భోజనం పెట్టేందుకు అప్పులు చేయాల్సివస్తోందని వారంతా ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇదే విషయమై ఇటీవల కలెక్టరేట్ ఎదుట ఆందోళన కార్యక్రమం నిర్వహించిన సంగతి తెలిసిందే. ప్రస్తుతం ధరల్లో మెనూ ఛార్జీలు పెంచకపోతే మంచి భోజనం సాధ్యం కాదని, కనీసం విద్యార్థికి 20 రూపాయలు మెనూ ఛార్జీలు పెంచాలని కూడా కోరుతున్నారు. రోజుకు రూ.100 చొప్పున నెలకు 3000 చెల్లిస్తే తమ కుటుంబాలను ఎలా పోషించుకోవాలని వారంతా ప్రశ్నిస్తున్నారు. ఈనేపథ్యంలో కనీసం గౌరవ వేతనం రూ.10వేలు ఇవ్వాలనే డిమాండ్ ముందుకు వచ్చింది. మున్సిపల్ ఇంజినీరింగ్ వాటర్ వర్క్స్, పర్యావరణ, ఎలక్ట్రికల్, నాన్ పిహెచ్ కార్మికులందరికీ బేసిక్ వేతనం రూ.21వేలు, టెక్నికల్ వేతనం రూ.24,500 చెల్లించాలని కోరుతూ ఎపి మున్సిపల్ వర్కర్స్ ఎంప్లాయిస్ ఫెడరేషన్ (సిఐటియు) ఆధ్వర్యంలో కలెక్టరేట్ వద్ద ధర్నా నిర్వహించారు. జీతాలు పెంచుతూ ప్రభుత్వం తక్షణమే జీవో ఇవ్వాలనేది వీరి డిమాండ్. తాటిపూడి రిజర్వాయర్ నుంచి జిందాల్ భూముల్లో చిన్న పరిశ్రమలకు నీరు ఇవ్వటానికి జారీ చేసిన జిఒ 14ను రద్దు చేయాలని, రిజర్వాయర్ కింద చివరి ఆయకట్టు వరకు రైతులకు సాగునీరు అందించాలని డిమాండ్ చేస్తూ ఎపి రైతు సంఘం ఆధ్వర్యాన కలెక్టరేట్ వద్ద రైతులు కూడా ధర్నా చేపట్టారు. రిజర్వాయర్ పరిధిలో సక్రమంగా నీరు అందక పంటలు దెబ్బతినీ రైతులు నష్ట పోతున్నారని, ఈ పరిస్థితిలో ప్రభుత్వాలు వున్న నీటిని పరిశ్రమలకు ఇస్తే ఇప్పుడు ఇంకా జిందాలు భూముల్లో చిన్న పరిశ్రమలకు నీరు ఇవ్వటానికి జిఒ విడుదల చేయడం అన్యాయమనేది రైతుల ఆవేదన. దీనిపై అధికారులుగానీ, ప్రజాప్రతినిధులుగానీ నోరు మెదపడం లేదు. తమకు రూ.26వేల కనీస వేతనం ఇవ్వాలని డిమాండ్ చేస్తూ విఆర్‌ఎలు చేస్తున్న ఆందోళన కొనసాగుతోంది. ప్రమోషన్లు కూడా ఇవ్వాలని డిమాండ్ చేస్తున్నా ప్రభుత్వం తనకు పట్టనట్టుగా వ్యవహరిస్తోంది. జిఒ నెంబర్ 5ను సడలించి ప్రమోషన్లు కల్పించాలంటూ గ్రామ సచివాలయాల్లోని సర్వేయర్లు ఆందోళన బాటపట్టారు. కోళ్ల ఫారాలతో తాము అనారోగ్యానికి గురవుతున్నామంటూ మెంటాడ మండలం బిరసాడవలస గ్రామస్తులు నిరసన తెలియజేస్తున్నారు. వీరి రోధన అరణ్యవేదినగానే మిగిలిపోతోంది తప్ప అధికారులుగానీ, ప్రజాప్రతినిధులుగానీ పట్టించుకోవడం లేదు. స్కూళ్లు, వసతి గృహాల్లో విద్యార్థులు ఎదుర్కొంటున్న సమస్యలను తక్షణమే పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యాన ఆందోళనలు మిన్నంటాయి. ఇన్ని ఆందోళనలు జరుగుతున్నా ఉమ్మడి జిల్లాలోని మంత్రులుగానీ, ఎమ్మెల్యేలుగానీ వీటిని పట్టించుకోలేదు. నవ్విపోదురుగాక నాకేంటి అన్నట్టుగా వ్యవరించడంతో ఆందోళనా కార్యక్రమాలు ఉద్యమ రూపం దాల్చే అవకాశాలు కనిపిస్తున్నాయని పలువురు చర్చించుకుంటున్నారు.



తిరుపతినాయుడు కుటుంబ సభ్యులను పరామర్శిస్తున్న చిన్నశ్రీను, రాజన్నదొర

తిరుపతినాయుడు కుటుంబానికి జెడ్‌పి చైర్మన్ పరామర్శ

ప్రజాశక్తి - సాలూరు

మాజీ జెడ్పీటీసీ, వైసిపి సీనియర్ నాయకులు రెడ్డి తిరుపతి నాయుడు ఇటీవల మరణించిన నేపథ్యంలో బాగువలసలో ఆయన కుటుంబ సభ్యులను జెడ్పీ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు పరామర్శించారు. శనివారం ఆయన మాజీ డిప్యూటీ సీఎం రాజన్నదొరతో కలిసి వైస్ ఎంపిపి రెడ్డి సురేష్, ఆయన సోదరులు సతీష్, శ్రీనివాసరావు, ఇతర కుటుంబ సభ్యులను పరామర్శించారు. సుదీర్ఘ కాలం వైసిపికి అండగా నిలిచిన రెడ్డి తిరుపతి నాయుడు మరణించడం పార్టీకి తీరని లోటని మజ్జి శ్రీనివాసరావు అన్నారు.

ఇవిఎం గోదాముల వద్ద పటిష్ట భద్రత : కలెక్టర్

ప్రజాశక్తి - పార్వతీపురం

ఇవిఎం గోదాముల వద్ద పటిష్టమైన భద్రత ఏర్పాట్లు ఉండాలని జిల్లా కలెక్టర్ ఎ.శ్యామ్ ప్రసాద్ అధికారులను ఆదేశించారు. త్రైమాసిక తనిఖీలో భాగంగా స్థానిక వ్యవసాయ మార్కెట్ యార్డు వద్ద గల ఇవిఎం గోదామును ఎన్నికల విభాగం అధికారులు, గుర్తింపు పొందిన రాజకీయ పక్షాల ప్రతినిధులతో కలిసి కలెక్టర్ శనివారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఇవిఎం గోదాము భద్రతకు చేపడుతున్న చర్యలను అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఇవిఎంలు, వివిప్యాట్స్ భద్రతకు పటిష్ట చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఈ తనిఖీలో జిల్లా రెవెన్యూ అధికారి కె.హేమలత, కలెక్టరేట్ ఎన్నికల విభాగం పర్యవేక్షకులు, వివిధ రాజకీయ పక్షాల ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.



ఎమ్మెల్యే జగదీశ్వరికి సాలువాతో సత్కరిస్తున్న డిటిఒ దుర్గాప్రసాద్

ఎమ్మెల్యేను కలిసిన డిపిటిఒ

ప్రజాశక్తి - కురుపాం

జిల్లాలో కొత్తగా బాధ్యతలు స్వీకరించిన జిల్లా రవాణాశాఖ అధికారి దుర్గాప్రసాద్ శనివారం స్థానిక ఎమ్మెల్యే తోయిక జగదీశ్వరిని గుమ్మలక్ష్మీపురంలో గల తన క్యాంపు కార్యాలయం వద్ద మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో రోడ్డు ప్రమాదాలు తగ్గించేలా పటిష్ట చర్యలు చేపట్టాలన్నారు. ముఖ్యంగా ఏజెన్సీ ప్రాంతాల్లో వాహన చోదకులకు విస్తృతంగా అవగాహన కార్యక్రమాలు చేపట్టాలని, వాహనాలు నడిపే 18 ఏళ్లు నిండిన ప్రతి ఒక్కరూ లైసెన్సులు తీసుకునేలా చర్యలు చేపట్టాలని సూచించినట్లు తెలిపారు.

సబ్ జైలును పరిశీలించిన జిల్లా అదనపు న్యాయమూర్తి

ప్రజాశక్తి - పాలకొండ

స్థానిక సబ్ జైలును జిల్లా అదనపు న్యాయమూర్తి సిహెచ్ వివేక ఆనంద శ్రీనివాస్ శనివారం పరిశీలించారు. ఖైదీలకు అందుతున్న సదుపాయాలపై ఆరా తీశారు. వారి యోగక్షేమాలను అడిగి తెలుసుకున్నారు. ఉచిత న్యాయ సహాయాన్ని ఎలా పొందాలో కూడా వివరించారు. ఆయనతో పాటు జిల్లా న్యాయ సేవాధికార సంస్థ అధ్యక్షులు ఎం.శ్రీధర్, మండల న్యాయ సేవా సంఘం అధ్యక్షులు సిహెచ్ హరిప్రియ, న్యాయవాదులు ఎం.శామ్యూల్, సహాయం, బి.రామ్మోహన్, ఆర్ సత్యనారాయణ ఉన్నారు.

తిరుమలలో ఐతిహ్య నృత్య ప్రదర్శన

ప్రజాశక్తి - పాలకొండ

పట్టణానికి చెందిన చిన్నారి కొండదాడి ఐతిహ్య కూచిపూడి నృత్య ప్రదర్శన ఆహూతులను ఎంతగానో ఆకట్టుకుంది. తిరుమల-తిరుపతి దేవస్థానంలో సుమారు 3వేల మంది భక్తుల సమక్షంలో ఐతిహ్య చేసిన ప్రదర్శన ఆహూతులను మంత్రముగ్ధులను చేసింది. ఈనెల 27న తిరుమల శ్రీవారి ఉత్సవాల్లో భాగంగా టిటిడి దేవాదాయ శాఖ నిర్వహించిన కార్యక్రమంలో భాగంగా ఈ ప్రదర్శన నిర్వహించారు. అహోబిలం మట్, మంత్రాలయం, శ్రీ వైఖాన సభ్యులు, టిటిడి నిర్వాహకులు ఈ కార్యక్రమంలో చిన్నారిని అభినందించారు.



చెత్త సేకరణను పరిశీలిస్తున్న ఎంపిడిఒ ప్రసాద్

చెత్త సేకరణ పరిశీలన

ప్రజాశక్తి - సీతానగరం

మండలంలోని నిడగల్లులో ఇంటింటి చెత్త సేకరణను ఎంపిడిఒ ఎంఎస్ఎల్ఎన్ ప్రసాద్ శనివారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రీన్ అంబాసిడర్ ప్రతి ఇంటి దగ్గరికి వెళ్లి చెత్త బుట్టల ద్వారా చెత్త సేకరించి, తడి చెత్త, పొడి చెత్తను వేరు చేయాలని అన్నారు. అలాగే చెత్త ద్వారా సేంద్రియ ఎరువులు తయారు చేసి దాని ద్వారా ఆర్థిక వనరుగా మార్చుకోవాలన్నారు. అనంతరం మంచినీటి ట్యాంకులను పరిశీలించారు. అక్కడ వాటర్ ట్యాంక్‌లో బ్లీచింగ్ కలిపి సీజనల్ వ్యాధులు రాకుండా తగిన జాగ్రత్త తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఇఒపిఆర్‌డి కెకె కుమార్ వర్మ, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

టిడిపి మండల కన్వీనర్‌గా అడ్డాకుల నరేష్

ప్రజాశక్తి - కురుపాం



గుమ్మలక్ష్మీపురం మండల టిడిపి కన్వీనర్‌గా అడ్డాకుల నరేష్‌ను శనివారం జరిగిన సంస్థాగత ఎన్నికల్లో మాజీ కన్వీనర్ పాడి సుదర్శనరావు బలపర్చగా టిడిపి నాయకులు, కార్యకర్తలు ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సమావేశానికి ఎమ్మెల్యే తోయక జగదీశ్వరి, పరిశీలకులుగా బుడా చైర్మన్ తెంటు లక్ష్మునాయుడు, రాష్ట్ర తూర్పు కాపు కార్పొరేషన్ డైరెక్టర్ గండి రామినాయుడు ఆధ్వర్యంలో ప్రశాంతంగా ఎన్నిక జరిగింది. ఈ సందర్భంగా నరేష్ మాట్లాడుతూ ఎమ్మెల్యే, టిడిపి నాయకులు, కార్యకర్తలు తనపై నమ్మకం ఉంచి కన్వీనర్‌గా ఎన్నుకున్నందుకు ప్రతి ఒక్కరికీ కృతజ్ఞత తెలిపారు. పార్టీ బలోపేతానికి ఎమ్మెల్యే సూచనలు, సలహాలు పాటిస్తూ పని చేస్తానని అన్నారు. కన్వీనర్‌గా ఎన్నికైన నరేష్‌కు నాయకులు, కార్యకర్తలు అభినందనలు తెలిపారు.

సైబర్ క్రైమ్‌పై అవగాహన తప్పనిసరి

ప్రజాశక్తి - కురుపాం

సైబర్ క్రైమ్ నేరాలపై ప్రతి ఒక్కరికీ అవగాహన తప్పనిసరిగా ఉండాలని ఎస్సై పి.నారాయణరావు అన్నారు. మండలంలోని గుజ్జుపాడులో ప్రజలకు సైబర్ క్రైమ్ నేరాలపై శనివారం అవగాహనకల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మొబైల్ ఫోన్ వాడుతున్న ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలన్నారు. కొత్త నెంబర్ల నుంచి ఫోన్ చేసి ప్రలోభాలు పలికి మోసాలకు గురిచేస్తుంటారని, కావున అటువంటి మాట లను ఎవరూ నమ్మొద్దని అన్నారు. అలాగే మత్తు పదార్థాలకు, మద్యానికి ఎవరూ బానిస కాకుండా ఉంటూ కుటుంబాలను సక్రమంగా చూసుకోవా లని సూచించారు. కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది, గ్రామస్తులు పాల్గొన్నారు.

అంగన్వాడీల సమస్యలు పరిష్కరించాలి

9న దేశవ్యాప్త సార్వత్రిక సమ్మెకు సన్నద్ధం

ప్రజాశక్తి - కొమరాడ

అంగన్వాడీల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ జులై 9న కొమరాడలో జరిగే దేశ వ్యాప్త సమ్మెను జయప్రదం చేయాలని సిఐటియు జిల్లా కమిటీ సభ్యులు కొల్లి సాంబమూర్తి పిలుపునిచ్చారు. శనివారం స్థానిక ఐసిడిఎస్ ప్రాజెక్టు వద్ద సిడిపిఒ సుగుణకు సమ్మె నోటీసును అంగన్వాడీ అందజేశారు. అనంతరం అంగన్వాడీ నాయకులు, సాంబమూర్తి మాట్లాడుతూ గత ప్రభుత్వ హయాంలో 42 రోజులు సమ్మె సమయంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత సమస్యలను పరిష్కరిస్తామని ఇచ్చిన హామీ ఏ ఒక్కటీ అమలు చేయలేదన్నారు. ఒకవైపు సెల్ ఫోన్లు పనిచేయక, మరోవైపు సిగ్నల్స్ రాక అంగన్వాడీ సిబ్బందిని ఇబ్బందులకు పెడుతున్నారన్నారు. కావున ఉద్యోగ భద్రతతో పాటు పని భారం తగ్గించేలా చర్యలు చేపట్టాలని కోరారు. కేంద్రప్రభుత్వం అవలంబిస్తున్న కార్మిక వ్యతిరేక విధానాలను నిరసిస్తూ జులై 9 జరిగే సమ్మెలో కార్మిక వర్గమంతా పాల్గొని జయప్రదం చేయాలని అంగన్వాడీ యూనియన్ తరుపున కార్మిక వర్గాన్ని కోరారు. కార్యక్రమంలో కొమరాడ ఐసిడిఎస్ ప్రాజెక్ట్ ప్రధాన కార్యదర్శి సిరికి అనురాధ, అంగన్వాడీ సెక్టార్ నాయకులతో పాటు అంగన్వాడీ టీచర్లు, మినీ వర్కర్లు, హెల్పర్లు పాల్గొన్నారు.

వీరఘట్టం: జులై 9న నిర్వహించనున్న దేశవ్యాప్త సార్వత్రిక సమ్మెను జయప్రదం చేయాలని కోరుతూ శనివారం ఎపి గ్రామపంచాయతీ ఎంప్లాయిస్ అండ్ వర్కర్స్ యూనియన్ (సిఐటియు) ఆధ్వర్యంలో స్థానిక మేజర్ పంచాయతీ జూనియర్ సహాయకులు ఎ.నర్సింగరావుకు సమ్మె నోటీస్



వీరఘట్టంలో సమ్మె నోటీసును అందజేస్తున్న పంచాయతీ కార్మికులు

అందజేశారు. ఈ సందర్భంగా మండల సిఐటియు కార్యదర్శి ఎన్.ప్రసాదరావు మాట్లాడుతూ కార్మిక వర్గాన్ని కట్టుబానిసలుగా మార్చే లేబర్ కోడ్ రద్దు చేయాలని, కాంట్రాక్టు అవుట్ సోర్సింగ్ కార్మికులను పర్మినెంట్ చేయాలని, పంచాయతీ కార్మికులకు కనీస వేతనం రూ.21,000 చెల్లించాలని, జిఒ 132, 142, 680పై హైకోర్టు తీర్పు అమలు చేయాలని, తదితర డిమాండ్లపై సమ్మె నోటీస్ అందజేశారు. కార్యక్రమంలో వై ప్రసాదరావు, పి.ప్రసాద్, వెంకట్, పారిశుధ్య కార్మికులు పాల్గొన్నారు.



గర్భిణులకు కిట్లను అందజేస్తున్న ఐటిడిఎ పిఒ అశుతోష్ శ్రీవాస్తవ

రక్తహీనతను నివారించాలి

మహిళలకు ఐటిడిఎ పిఒ పిలుపు

ప్రజాశక్తి - కొమరాడ

ఐటిడిఎ పరిధిలో ఏ ఒక్కరూ రక్తహీనతతో బాధపడరాదని ప్రాజెక్ట్ అధికారి అశుతోష్ శ్రీవాస్తవ మహిళలు, గర్భిణీలకు పిలుపు నిచ్చారు. అనీమియా ముక్త్ భారత్ లో భాగంగా లీ ఫార్మా లిమిటెడ్, నాబార్డ్ బ్యాంక్ సౌజన్యంతో గర్భిణీలు, మహిళలకు బలవర్ధకమైన ఆహారం కలిగిన కిట్లను కొమరాడలో శనివారం ఆయన పంపిణీ చేశారు. అనంతరం పిఒ మాట్లాడుతూ పోషక విలువలు కలిగిన ఆహారం తీసుకోకపోవడం వల్ల రక్తహీనత ఉంటుందని, కావున ఈ కిట్ ద్వారా అందించిన వస్తువులను క్రమం తప్పకుండా తీసుకుంటే రక్తహీనతను నివారించవచ్చని సూచించారు. అనంతరం కొమరాడలోని గిరిజన సంక్షేమ బాలికల ఆశ్రమ ఉన్నత పాఠశాలను సందర్శించారు. అక్కడి విద్యార్థులతో సంభాషించిన ఆయన వంటగది సౌకర్యాలను పరిశీలించారు. విద్యార్థులకు అందిస్తున్న ఆహారం నాణ్యత పరిమాణాలను తనిఖీ చేశారు. అనారోగ్య గదిని తనిఖీ చేసి, అందుబాటులో ఉన్న వైద్య సహాయక సౌకర్యాలపై వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఈ పర్యటనలో ఐసిడిఎస్ పీడీ డాక్టర్ టి.కనకదుర్గ, నాబార్డ్ ఎజిఎం దినేష్, తహశీల్దార్ సత్యనారాయణ, సిడిపిఒ సుగుణ కుమారి, ఐసిడిఎస్ సూపర్వైజర్లు, ఇతర అధికారులు, ఎన్జీవో సభ్యులు శ్రీధర్, తదితరులు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికి కృషి : ఎంపిడిఒ

ప్రజాశక్తి - కొమరాడ

మారుమూల గిరిజన ప్రాంతాన్ని అభివృద్ధి చేసి గిరిజన ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించేందుకు కృషి చేస్తున్నట్లు ఎంపిడిఒ ఎస్.రమేష్ అన్నారు. మండలంలోని పెదశేఖలో డిఎ జుగా కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నుంచి గిరిజనులకు అందుతున్న పథకాలు, సేవలను వివరించారు. ఈ కార్యక్రమంలో భాగంగా గ్రామంలోని ప్రజలకు సంక్షేమ పథకాలు అవసరమైన కుల, ఆదాయ నివాస ధ్రువీకరణ పత్రాలు అందజేశారు. అనంతరం విద్యార్థులకు అవసరమైన ఆదాయ, నివాస ధ్రువీకరణ పత్రాలు అందజేశారు. కార్యక్రమంలో అవసరమైన వారికి కుల ధ్రువీకరణ పత్రాలు 28, రేషన్ కార్డు ఒకటి, ఆధార్ కార్డులు 6, సామాజిక భద్రత పింఛన్లు రెండు పంపిణీ చేశారు. అనారోగ్యంగా ఉన్న పలువురు గిరిజనులకు మలేరియా నిర్ధారణతో పాటు వివిధ రకాల నిర్ధారణ పరీక్షలు చేశారు. ఈ సందర్భంగా ఎంపిడిఒ రమేష్ మాట్లాడుతూ గిరిజన ప్రాంతాల్లో సమ్మిళిత, స్థిరమైన అభివృద్ధిని సాధించడానికి భారత ప్రభుత్వం డిఎ జుగా అనే పరివర్తనాత్మక చొరవను ప్రారంభించిందని అన్నారు. కార్యక్రమంలో గిరిజన ప్రాంతాల్లో ఉన్న సంక్షేమ పథకాలను సక్రమంగా అమలు చేసి గిరిజన ప్రాంతాన్ని అభివృద్ధి చేయాలని ప్రభుత్వాలు కృషి చేస్తున్నాయన్నారు. కార్యక్రమంలో ఎపిఎం సురేష్ బాబు, ఐసిడిఎస్ సూపర్వైజర్లు, మెడికల్, సచివాల సిబ్బంది, సర్పంచ్ ఎంపిటిసి ప్రజలు పాల్గొన్నారు.



సీతంపేట : గుమ్మడలో ఏర్పాటు చేసిన స్టాల్‌ను పరిశీలిస్తున్న కేంద్ర పరిశీలకులు

సీతంపేట : గిరిజనుల అభివృద్ధికి పిఎం డిఎ జుగా అని కేంద్ర ప్రభుత్వ పరిశీలకులు రాహుల్ కూరాన అన్నారు. శనివారం సీతంపేట ఏజెన్సీలో సీది, గుమ్మడ గిరిజన గ్రామాలను సందర్శించారు. ఈ సందర్భంగా గిరిజనులు కేంద్ర ప్రభుత్వం ఇచ్చిన నిధులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. గిరిజనులు పరిస్థితి గురించి ఆరా తీశారు. కేంద్ర ప్రభుత్వ సంక్షేమ పథకాలు ప్రతి గిరిజన లబ్ధిదారునికి అందాలని అధికారులకు సూచించారు. కార్యక్రమంలో ట్రైబల్ వెల్ఫేర్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ కె వి ఎస్ ఎన్ కుమార్, డిఇ సింహాచలం, ఎంపిడిఒ మిశ్రా, డిప్యూటీ ఎంపిడిఒ రామకృష్ణ, సిడిపిఒ అమ్మాలమ్మ, ఎఇలు కిరణ్, సత్యం, వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

ఖతర్‌లో ఉద్యోగాలకు ప్రత్యేక డ్రైవ్

జిల్లా నైపుణ్యాభివృద్ధి సంస్థ అధికారి కె.సాయికృష్ణ చైతన్య

ప్రజాశక్తి - పార్వతీపురం

ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నైపుణ్యాభివద్ధి సంస్థ ఆధ్వర్యంలో ఖతర్ దేశంలో వెల్డర్స్ ఉద్యోగ నియామకాల కోసం భారీ ఉద్యోగ నియామక డ్రైవ్ చేపట్టినట్టు జిల్లా నైపుణ్యాభివద్ధి సంస్థ అధికారి కె.సాయికృష్ణ చైతన్య తెలిపారు. ఈ మేరకు శనివారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. అభ్యర్థులు 24 - 45 ఏళ్ల లోపు ఉండాలని, ఐటిఐ లేదా ఐటిసి విద్యార్హత కలిగి నాలుగేళ్ల అనుభవం ఉండాలన్నారు. టిఐజి లేదా ఎఆర్‌సి మల్టీవెల్డర్ ఉద్యోగానికి ఎంపికైన వారికి రూ.52,000 నుంచి రూ.61,500 , టీఐజీ లేదా ఏఆర్సీ వెల్డర్ ఉద్యోగానికి రూ.42,500 నుంచి రూ.52,000 వరకు వేతనాలు ఉంటాయన్నారు. కాంట్రాక్ట్ కాలం రెండేళ్లు ఉంటుందని, ఉచిత వసతి, భోజనం, వైద్యం, రవాణా సదుపాయాలతో పాటు స్వదేశానికి ఒక్కసారి వచ్చి వెళ్లేందుకు టిక్కెట్ సౌకర్యం ఉంటుందన్నారు. ఆసక్తి గల అభ్యర్థులకు పాస్ పోర్ట్, అనుభవం, విద్యార్హత ధ్రువపత్రాలు ఖచ్చితంగా ఉండాలన్నారు. అర్హత కలిగిన అభ్యర్థులు తమ బయోడేటాను skillinternational@apssdc.inకు పంపాలన్నారు. మరిన్ని వివరాల కొరకు 99888 53335, 87126 55686 నెంబర్లను సంప్రదించాలని ఆయన ఆ ప్రకటనలో వివరించారు .



బాధితులకు చెక్కు అందజేస్తున్న మంత్రి సంధ్యారాణి

పేదలకు అండగా సిఎం సహాయనిధి

ప్రజాశక్తి - సాలూరురూరల్

అనారోగ్యంతో బాధపడే పేదలకు అండగా సిఎం సహాయనిధి ఎంతో దోహదపడుతుందని రాష్ట్ర గిరిజనసంక్షేమశాఖ, స్త్రీ, శిశుసంక్షేమశాఖా మంత్రి గుమ్మిడి సంధ్యారాణి అన్నారు. శనివారం మంత్రి క్యాంపు కార్యాలయంలో సిఎం సహాయనిధి నుంచి మంజూరైన చెక్కులను లబ్ధిదారులకు అందజేశారు. రూ.3,00,503 విలువైన సిఎం సహాయ నిధి చెక్కులను సాలూరుకు చెందిన ప్రతిపాటి రాజారావుకు, మెంటాడ మండలం పిట్టాడకు చెందిన గుల్లిపల్లిరియానిషి శ్రీనిధి, ఎర్ర మురళీకృష్ణకు అందజేశారు. కార్యక్రమంలో నియోజకవర్గ పరిధిలో గల పలువురు టిడిపినాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఆ రోడ్డులో ట్రాఫిక్ నిబంధనలు ఉండవా?

ప్రజాశక్తి - సాలూరు

పట్టణంలోని రామా కాలనీలో అఫీషియల్ కాలనీ రోడ్డు వాహనాల రాకపోకలతో నిత్యం రద్దీగా వుంటోంది. ముఖ్యంగా గిరిజన సంక్షేమ శాఖ మంత్రి సంధ్యారాణి, మాజీ డిప్యూటీ సిఎం రాజన్నదొర స్థానికంగా ఉన్నప్పుడు ఈ రోడ్డు గుండా టిడిపి, వైసిపి నాయకులు, కార్యకర్తలు వాహనాలతో వస్తూ పోతుంటారు. అప్పుడప్పుడు జిల్లా అధికారులు, స్థానిక అధికారులు కూడా కార్లలో మంత్రి నివాసానికి వస్తున్నారు. ఈ రోడ్డు ఇరుగ్గా ఉండడంతో తరచూ మంత్రి నివాసం ముందు ట్రాఫిక్ ఇబ్బందులు ఎదురవుతున్నాయని కొంతమంది వైసిపి నాయకులు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు. మంత్రి సంధ్యారాణి నివాసం ముందు రోడ్డుకు ఇరువైపుల ద్విచక్ర వాహనాలను పార్కింగ్ చేయడం వల్ల మాజీ డిప్యూటీ సీఎం రాజన్నదొరతో పాటు స్థానికులు తమ ఇళ్లకు వెళ్లడానికి ఇబ్బంది పడుతున్నారు. మంత్రి సంధ్యారాణి నివాసం దాటిన తర్వాతనే రాజన్నదొర నివాసం వుంది. రోడ్డుకు ఇరువైపులా వాహనాల పార్కింగ్ లేకుండా చూడాలని, తన రాకపోకలకు ఇబ్బంది అవుతోందని రాజన్నదొర గతంలో పట్టణ పోలీసులకు ఫిర్యాదు చేశారు. శనివారం కూడా ఆయన ఇంటి నుంచి బయటకు వెళ్లి వచ్చినప్పుడు మంత్రి ఇంటి ముందు రోడ్డుకు ఇరువైపులా ద్విచక్ర వాహనాల పార్కింగ్ చేయడంతో కొద్దిసేపు ఆయన



రామా కాలనీకి వెళ్లే రోడ్డుపైనే కార్లు, ద్విచక్ర వాహనాలు

ఇబ్బంది పడ్డారు. రాజన్నదొరతో పాటు అఫీషియల్ కాలనీ లో వున్న ఉద్యోగులు, అధికారులు ఈ రోడ్డు మీదుగానే కార్లు, ద్విచక్ర వాహనాల్లో రాకపోకలు సాగిస్తున్నారు. వారు కూడా తరచూ ఇలాంటి ఇబ్బందులే ఎదుర్కొంటున్న పరిస్థితి నెలకొంది. దీనిపై రాజన్నదొర మాట్లాడుతూ ఈ రోడ్డులో వాహనాల రాకపోకలకు ఎదురవుతున్న ఇబ్బందుల గురించి టౌన్ సిఐ అప్పలనాయుడుకు తాను ఇప్పటికే చెప్పానని, పోలీసులు ఎటువంటి చర్యలు తీసుకోవడం లేదని చెప్పారు. ఇంతవరకు తానే అనేకసార్లు ఇబ్బంది పడ్డానని, కాలనీవాసులు కూడా ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని చెప్పారు.

పాఠాలు చదివింది, ఉద్యోగ విరమణ ఇక్కడే..

తెలుగు పండిట్ బొత్స హరిప్రసాద్

ప్రజాశక్తి - మక్కువ

తాను చదువుకున్న పాఠశాలలోనే ఉపాధ్యాయుడిగా బోధిస్తూ ఉద్యోగ విరమణ చేయడం తనకు సంతృప్తినిచ్చిందని తెలుగు పండిట్ బొత్స హరిప్రసాద్ అన్నారు. ఉపాధ్యాయ వృత్తి నుంచి ఈనెల 30న ఉద్యోగ విరమణ చేస్తున్న సందర్భంగా 'ప్రజాశక్తి'తో ఆయన మాట్లాడారు. వివరాలు ఆయన మాటల్లోనే..



మాది మక్కువ మండలం చప్పబుచ్చంపేట పంచాయతీ పరిధి పాయికపాడు గ్రామం. బొత్స సూరి నాయుడు, నారాయణమ్మ తల్లిదండ్రులు. తండ్రి ఉపాధ్యాయుడు కావడంతో నా చదువు కూడా సజావుగానే సాగింది. మక్కువ జిల్లా పరిషత్ పాఠశాలలోనే పదో తరగతి వరకు చదువుకొని, మిగిలిన చదువు బొబ్బిలి, విజయనగరంలో కొనసాగింది. తెలుగు భాషలో ప్రావీణ్యం ఉండడం, భాషపై మక్కువతో ఎంఎ తెలుగు పూర్తి చేశాను. ఇదే మండలంలో ఎ.వెంకంపేట పాఠశాలలో 1984లో ఉపాధ్యాయ ప్రస్థానం ప్రారంభమైంది. సాలూరు వేద సమాజం పాఠశాలలో ఎక్కువ కాలం పని చేయడంతో పాటు మక్కువ జిల్లా పరిషత్ పాఠశాలలో రెండుసార్లు సుమారు 13 ఏళ్లు ఇక్కడ పనిచేశారు. ఇక్కడే చదువుకున్న నేను సోమవారం ఉద్యోగ విరమణ ఇక్కడే చేయడం ఎంతో సంతృప్తి నిచ్చింది.

భార్య శారద, కుమారుడు జయ ప్రసాద్ బాబు, కుమార్తెలు స్రవంతి, పద్మజ ఉన్నారు. ఉద్యోగరీత్యా వీరంతా విదేశాల్లోనే స్థిరపడి ఉన్నారు.

గీతా బోధనలో దిట్ట

ఉపాధ్యాయ వృత్తి కొనసాగిస్తూనే మరోవైపు పలు ఆధ్యాత్మిక కార్యక్రమాల్లో పాల్గొంటూ భగవద్గీతతో పాటు పలు ఆధ్యాత్మిక తత్వాలను బోధిస్తూ పలు సన్మానాలను కూడా హరి ప్రసాద్ అందుకున్నారు. హరి ఓం మాస్టర్ అంటూ అంతా ముద్దుగా పిలుస్తారు. పార్వతీపురం పట్టణంలో అమ్మ సేవా సమితిలో సభ్యులుగా కొనసాగుతూ పలు సేవా కార్యక్రమాల్లో పాల్గొంటున్నారు.

వారంలోగా డబ్బులు చెల్లించకపోతే క్రిమినల్ కేసు

ప్రజాశక్తి - వీరఘట్టం

స్వయం సహాయ సంఘం గ్రూపు సభ్యుల నుంచి రికవరీ చేసిన శ్రీనిధి డబ్బులు వారం రోజుల్లోగా జమ చేయకపోతే క్రిమినల్ కేసు పెడతామని ఎపిఎం కె.రాము విఒఎను హెచ్చరించారు. మండలంలోని దశమంతపురంలో ఎస్‌హెచ్‌జి గ్రూప్ సభ్యులతో శనివారం సమావేశం ఏర్పాటు చేసి తీర్మానించారు. శ్రీనిధి ద్వారా రుణం తీసుకున్న సభ్యుల నుంచి రూ.1.91 లక్షలు రికవరీ కట్టకుండా సొంతానికి వాడుకున్నారని, దీనిపై విఒఎపై విచారణ చేపట్టినట్లు తెలిపారు. విచారణలో సిసి వై.ఆనందరావు, వెలుగు సిబ్బంది, ఎస్‌హెచ్‌జి సభ్యులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఎపిఎం రాము

ప్రథమ చికిత్సకు మందులు సిద్ధం చేయాలి

ప్రజాశక్తి - సీతానగరం

ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో అత్యవసర సమయాల్లో ప్రథమ చికిత్సకు అవసరమయ్యే మందులు, వైద్య పరీక్షలు సిద్ధంగా ఉంచాలని ఎన్‌సిడి జిల్లా ప్రోగ్రాం అధికారి డాక్టర్ టి.జగన్ మోహనరావు సూచించారు. ఈ మేరకు స్థానిక పిహెచ్‌సిని శనివారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ముఖ్యంగా సాయంత్రం రాత్రివేళల్లో ఎటువంటి ఆరోగ్య సమస్యలతో ఆరోగ్య కేంద్రానికి వస్తున్నారు, వారికి అందజేస్తున్న చికిత్సా వివరాలు, ఓపి రికార్డులను పరిశీలించారు. ప్రస్తుతం వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో వ్యాధులు ప్రబలే అవకాశం ఉన్నందున అవసరమైన నిర్ధారణ పరీక్షలు పరీక్షలు, మందులతో పాటు కుక్క, పాముకాటులకు అవసరమైన ఇంజక్షన్ల లభ్యతపై పరిశీలించారు. ప్రధాన రహదారికి సమీపాన పిహెచ్‌సి ఉన్నందున ఆర్‌టిఎ కేసులు వచ్చే అవకాశం ఉన్నందున ప్రథమ చికిత్స కిట్లను ఆస్పత్రిలో సిద్ధంగా ఉంచాలన్నారు. పిహెచ్‌సిలో ఇన్వెర్టర్ బ్యాటరీ పనితీరును గమనించారు. ఆసుపత్రిలో సిబ్బంది అన్నివేళలా అందుబాటులో ఉంటూ వైద్యం దృష్ట్యా రోగులకు ఎటువంటి ఇబ్బంది లేకుండా చూడాలన్నారు. కార్యక్రమంలో వైద్య సిబ్బంది తదితరులు ఉన్నారు.

కేన్సర్‌తో మరణించిన కుటుంబానికి పరామర్శ

ప్రజాశక్తి - కొమరాడ

కేన్సర్ బారిన పడి మృతి చెందుతున్న కుటుంబాలకు, కేన్సర్ రోగులకు సరైన చికిత్స అందించి కుటుంబాలను ఆదుకోవాలని సిపిఎం నాయకులు కొల్లి సాంబమూర్తి డిమాండ్ చేశారు. కేన్సర్‌తో మరణించిన గుంట్రెడ్డి ఉమామహేశ్వరరావు కుటుంబాన్ని సిపిఎం నాయకులు కొల్లి సాంబమూర్తి స్థానికులతో కలిసి శనివారం పరామర్శించారు. ఈ సంధ్బంగా ఆయన మాట్లాడుతూ మండలంలోని గంగరేగివలస పంచాయతీ పరిధిలో గల స్వామినాయుడువలసలో ఇప్పటికే కేన్సర్‌తో 12 మంది చనిపోగా ఇంకా అనేకమంది బాధపడే పరిస్థితి ఉందని అన్నారు. ఈ పరిస్థితిని సిపిఎంతో పాటు ప్రజాసంఘాల నాయకులు అధికారుల దృష్టికి తీసుకెళ్లినా ఎలాంటి చర్యలు తీసుకోలేదన్నారు. ఏడేళ్ల క్రితం ఈ గ్రామంలో నిర్మించిన పురుగుల మందు ఫ్యాక్టరీ వల్ల కూడా కొంతవరకు తమకు ఈ వ్యాధులు వస్తున్నాయని గ్రామస్తులు ఆరోపిస్తున్నారన్నారు. ఇలాంటి సందర్భంలో ఫ్యాక్టరీకి అనుమతులు ఉన్నాయా? లేదా? అనుమతులకు మించి ఏమైనా పురుగుల మందులు తయారు చేస్తున్నారా అన్న విషయాన్ని అధికారులు పూర్తిస్థాయిలో దర్యాప్తు చేపట్టాలని డిమాండ్ చేశారు. ఆ ఫ్యాక్టరీ ద్వారా కలుషితమైన నీరు వస్తుందన్న ఆరోపణలు కూడా ఉన్నాయని, ఆ పక్కనే చెరువుకు ఆ నీటితో పాటు వ్యర్థ పదార్థాలు చేరడం వల్ల నీరు కలుషితమవుతుందన్న అనుమానాలు కూడా ఉన్నాయని అన్నారు. వీటన్నింటి పైన పూర్తి స్థాయిలో దర్యాప్తు చేపట్టాలని కోరారు. ఇప్పటికే ఎవరైతే కేన్సర్‌తో మృతి చెందారో ఆ కుటుంబాలను ప్రభుత్వం ఆదుకోవాలని కోరారు. లేకుంటే పెద్దఎత్తున ఆందోళన చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో స్థానిక ఎంపిటిసి సభ్యులు గంట వెంకటనాయుడు, స్థానిక రైతులు, ప్రజలు పాల్గొన్నారు.

పంటల బీమాను వినియోగించుకోవాలి

ప్రజాశక్తి - వీరఘట్టం

ఖరీఫ్ సీజన్లో రైతులు పంటల బీమా పథకాన్ని వినియోగించుకోవాలని స్థానిక వ్యవసాయ అధికారి జక్కువ సౌజన్య రైతులను కోరారు. శనివారం స్థానిక కార్యాలయంలో విలేకరులతో మాట్లాడారు. వరికి రూ.84 ప్రీమియం చెల్లిస్తే ఎకరాకు రూ.42వేలు ఇన్సూరెన్స్ కవర్ అవుతుందని తెలిపారు. మొక్కజొన్నకు రూ.72 ప్రీమియం చెల్లిస్తే ఎకరాకు రూ.36వేలు ప్రధాన మంత్రి ఫసల్ భీమ యోజన పథకం కింద ఇన్సూరెన్స్ వర్తిస్తుందనిఅన్నారు. రిస్ట్రికేడ్ వెదర్ బెస్ట్ క్రాఫ్ట్ ఇన్సూరెన్స్ స్కీం ప్రతి ఎకరాకు రూ.1923 ప్రీమియం చెల్లిస్తే రూ.38వేలు ఇన్సూరెన్స్ వర్తిస్తుందని, ఎకరా అరటి రూ.3036 ఇన్సూరెన్స్ చెల్లిస్తే రూ.60 వేలు వర్తిస్తుందని, ఆసక్తి గల రైతులు జూలై 15లోగా ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని ఆమె కోరారు.

కడకెల్లలో వైద్య శిబిరం

ప్రజాశక్తి - వీరఘట్టం

మండలంలోని కడకెల్లలో శనివారం స్థానిక వైద్యాధికారి బి.ప్రదీప్ కుమార్ ఆధ్వర్యంలో వైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా జ్వర పీడితులు, గర్భిణీలు, మధుమేహ, రక్తపోటు, తదితరకాలైన వ్యాది.గ్రస్తులకు ప్రత్యేక వైద్య తనిఖీలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో సూపర్వైజర్ ఒ.సుభారత మణి, ఎంఎల్‌హెచ్ పి.అనూష, ఎఎన్‌ఎం, ఆశా కార్యకర్తలు, 104 సిబ్బంది, గ్రామస్తులు పాల్గొన్నారు.



కాలువల్లో పూడికలు తొలగిస్తున్న మున్సిపల్ అధికారులు

యుద్ధప్రాతిపదికన పూడికతీత

ప్రజాశక్తి - పార్వతీపురం టౌన్

మున్సిపల్ పరిధిలో గల జగన్నాథపురంలోని 29, 30,1 వార్డుల్లో గల కాలువల్లో పూడికలు పేరుకుపోయి వాడుక నీరు వెళ్లేందుకు అవకాశం లేదు. దీంతో అజెండాలో పొందుపర్చిన అంశంలో భాగంగా కౌన్సిల్ సభ్యులు ఆమోదంతో మున్సిపల్ కమిషనర్ సిహెచ్ వెంకటేశ్వర్లు ఆదేశాల మేరకు మున్సిపల్ ఇంజనీరింగ్ అధికారుల పర్యవేక్షణలో శనివారం పూడికతీత పనులు చేపట్టారు. మరికొన్ని రోజుల్లో వర్షాలు పడే అవకాశం ఉన్నందున లోతట్టు ప్రాంతాల్లో వర్షపు నీరు నిల్వ లేకుండా ఉండేందుకు, ముందస్తు చర్యల్లో భాగంగా ఈ పనులు చేస్తున్నామని తెలిపారు. ఈ పనులతో పాటు పట్టణ ప్రధాన రహదారికి ఇరువైపులా ఉన్న పెద్ద కాలువలతో పాటు, మున్సిపల్ పరిధిలో ఉన్న అన్ని వార్డుల్లో ఈ పూడిక తీత పనులు చేపట్టేందుకు చర్యలు చేపడుతున్నామని కమిషనర్ తెలిపారు.